# సొగసు చూడ తరమా?

-పిశిపాటి పద్మజారాణి

**నేను, వంశీ, గోపీ ముగ్గురం బాగా క్లోజ్ ఫ్రెండ్స్.**

**ముగ్గురం బేచిలర్స్... అదేనండీ బ్రహ్మచారులం, ముగ్గురం వేర్వేరు శాఖలలో పనిచేస్తోన్నా ఉండేది ఒకే రూంలో!**

నేను ఆంధ్రాబాంక్, వంశీ ఎలక్ట్రిక్‌సిటీ డిపార్ట్‌మెంట్, గోపీ మాత్రం ఎల్.ఐ.సి.లో!

మా వాళ్ళిద్దరిదీ తుని, నాది విజయనగరం జిల్లాలో కొత్త వలస!

కానీ ప్రస్తుతం ముగ్గురం పనిచేసేది రాజమండ్రి లోనే!

అందరం ఒకే వయసువాళ్ళం, వారిద్దరూ వారం వారం తుని వెళతారు.

నేను నెలకి ఒకసారి మా ఊరు వెళతాను! అందరిలోకీ నేను బాగా కళారాధకుణ్ణి! ఇదీ మా గురించీ క్లుప్తంగా!

మేం వచ్చి అపుడే సంవత్సరం నిండింది. నాకు బాగా నచ్చింది 'రాజమండ్రి!'

చక్కగా గలగలా ప్రవహించే గోదావరీనదీ, ప్రక్కనే ధవళేశ్వరం బ్రిడ్జీ, కోటిలింగాల రేవూ, హితకారిణి సమాజం, ఇవన్నీ రోజు చూసుకుంటూ, దాటుకుంటూ మా రూంకి చేరుతాం.

గోదావరి క్రొత్త బ్రిడ్జి దగ్గర గట్లు గట్లుగా ఉంటుంది.

అక్కడే చాలా దేవాలయాలుంటాయి. అక్కడ కూర్చొని స్వచ్ఛమైన గోదావరి పైనుంచి వచ్చే గాలిని ఆస్వాదిస్తూ ముగ్గురం కబుర్లు చెప్పుకుంటూ ఉంటాం!

సూర్యుడు అస్తమిస్తున్నప్పుడూ, లేత ఎరుపురంగు బింబం కొండలచాటుకి వెళ్ళిపోతున్నప్పుడూ, గోదావరి బ్రిడ్జిపై నుంచి రైలు వేగంగా ధనధనాశబ్దం చేస్తూ వెళ్ళిపోతుంటే గోదావరి గట్టుపైన కూర్చొని చూడటం ఒక సరదా.

రైలు వెళ్ళిపోయాక వెనకనే లేచే బూడిదరంగు పొగ అలలు అలలుగా దట్టంగా ఆకాశంలోకి వెళ్ళి కనుమరుగయ్యే దృశ్యం చాలా ఇష్టం నాకు.

అలాగే లేత ఎరుపు సూర్యకిరణాలు గోదావరిలో పడి అది రిఫ్లెక్టు అవుతున్న దృశ్యం మనోహరం! బరువుగా గోదావరి నదిలో నిండు గర్భిణీ స్త్రీల్లా కదిలే తెరచాపలున్న పడవలు చూడటం భలే బాగుంటుంది.

రాత్రి 7 గంటలదాకా అలా, అలా పిచ్చాపాటి మాట్లాడుకొని మా రూంకి దగ్గరే ఉన్న నెల్లూరు మెస్‌కి వెళ్ళి భోజనం చేసి వచ్చి పడుకోవటం మాకు మామూలు అయ్యింది.

ఈ సంవత్సరం గోదావరి నదికి పుష్కరాలు!

అంటే తెల్సుకదండీ! పన్నెండు సంవత్సరాలకి ఒక్కసారి వస్తుందట!

మేం వచ్చాక ఇది తొలిపుష్కరం!

అపుడే గోదావరి నదికి పుష్కరాల నిమిత్తం గవర్నమెంటు చాలా డబ్బు కేటాయించింది.

అందుకే కొత్త హంగులతో గోదావరి నదినీ, రాజమండ్రినీ చక్కగా ముస్తాబు చేశారు.

పుష్కరఘాట్ వెలిసింది కోటిలింగాల రేవుకి జతగా. 'పుష్కరమాత' విగ్రహాన్ని నెలకొల్పారు. కొత్త సొయగాలు అన్నివైపులా వెల్లివిరుస్తున్నాయి.

అంతా పోలీస్‌బందోబస్తు, బారికేడ్లు అన్నివైపులా, ఒకవైపు ఎన్.సి.సి.వారు వాలంటీర్లుగా ఉన్నారు. అసలే రద్దీగా ఉండే రాజమండ్రిలో ఈ పుష్కరాలవల్ల ఇంకా రద్దీ ఎక్కువైంది!

ఉదయం పదిగంటలు దాటినా ఇంకా పుష్కర స్నానం చేస్తున్నవాళ్ళు ఒక ప్రక్కా, ఇంకోవైపు పెద్దలకు పిండ ప్రదానం చేసేవాళ్ళూ, మరోప్రక్క పక్షిణీ పట్టే వాళ్ళూ, ఇంకోపక్క గోదావాలు శాస్త్రీగా జల్లుతోన్న పురోహితులూ!

ఇలా ఇంకా 10 రోజులుంటుంది.

ఆ రోజు ఆదివారం. మా అందరికీ సెలవు రోజు.

మా వాళ్ళు ఇద్దరూ తుని వెళ్ళలేదు.

వాళ్ళిద్దరూ సెలవు తీసుకొని, నాలుగు రోజులు సెలవు పెట్టి తుని వెళతారు మర్నాడు, ముగ్గురం పుష్కర ఘాట్‌కి వెళ్ళి 'కలర్స్'ని చూడాలి అని గట్టిగా నిర్ణయించుకున్నాం.

ఏం అనుకుంటున్నారు? మరి బ్రహ్మచారులంటేనే శతమర్కటాలకి సమానం అంటారుగా... పోనీ అలానే మీరూ అనుకోండి! [illegible] ముస్తాబై ఉదయం ఎనిమిది గంటలకి రూంకి తాళంవేసి తిన్నగా గోదావరి జనప్రవాహం ఉన్న చోటికి చేరుకున్నాం.

ఆ చివర నుంచి ఈ చివర దాకా బాగా రద్దీగా ఉంది. స్నానాలు బట్టలపైనే చేసేసి అక్కడే బట్టలు మార్చేసుకుంటున్నారు.

స్త్రీ, పురుష తేడాలేదు.

వయో బేధం అంతకన్నా లేదు.

గోదావరి నది రెచ్చిపోయి ఉత్సాహంగా గర్వంగా పొంగి పొంగి ప్రవహిస్తోంది.

ఒకవైపు అంతా స్టాల్స్, ఇంకోవైపు కేవలం పుస్తకాల స్టాల్సూ, మరో ప్రక్క ఎగ్జిబిషన్నూ అలా అలా అంతా బిజీ!

నా జీవితంలో ఎప్పుడూ అంత బిజీ నేను చూడలేదు.

నాకు తెల్సిందల్లా మా కొత్త వలసలో మంగళవారం, మంగళవారం సంత, అంతే! ఆ బిజీనే!

అస్సలు ఇక్కడికి వచ్చేదాకా పుష్కరం అంటేనే ఐడియా లేదు నాకు, మా వాళ్ళిద్దరికీ అంతేట, వాళ్ళూ నా బాపతే!

సరే... అందర్నీ... అన్నీ... చూస్తోన్న నా కాళ్ళూ, కళ్ళూ ఒకచోట గాలం వేసినట్లు ఆగిపోయాయి.

అసలు మా వాళ్ళు నన్ను అనవసరంగా 'అటువైపు' లాక్కెళ్ళారు. నాది అసలే బలహీనమైన గుండె... మంచి కళా హృదయం!

మంత్రముగ్ధుడినైపోయాను. ఆ రూపంచూసి నా గుండె కొట్టుకునే వేగం పెరిగింది.

ఎంత అందం? ఎంతో చక్కని రూపం... గోదావరి నదిలో పూర్తిగా తడిసి ఒళ్ళంతా అతుక్కుపోయిన చీరా, బరువైన గుండెల్ని దాచలేక అవస్థపడుతున్న జాకెట్, అసలు ఉందా? లేదా? అన్పించే నడుము... నీటిలో తడిసిన కురులు పిరుదుల్ని దాటినపుడు విచిత్రంగా కురులలోంచి జాలువారే నీటి బిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి.

కటిభాగం రెచ్చగొడుతోంది. మెడలో వేసుకున్న ఒంటిపేట గొలుసు జాకెట్‌లో చిక్కుకు పోయింది.

జాకెట్, చీరా నీటిలో తడిసి స్పష్టంగా ఆమె అందాల్ని బహిర్గతం చేస్తున్నాయి.

లోపల ఇంకే ఆచ్ఛాదనా లేదని తెలుస్తూనే ఉంది. ట్రాన్స్‌పరంట్‌గా వళ్ళు అంతా కనబడుతోంది.

తెల్లగా, నాజూగ్గా, వయ్యారంగా ఉంది. ఎర్రని అధరాలు దొండపళ్ళని జ్ఞప్తికి తెస్తున్నాయి.

ఒక చేత్తో చీర కుచ్చిళ్ళని ఎత్తి పట్టుకొని నాజూగ్గా, నగలుపోతూ నదిలోంచి బయటికి వస్తోంది.

అలా చీర ఎత్తిపట్టుకున్నప్పుడు పచ్చని కాళ్ళకి ఉన్న జాలరిలైపు పట్టాలు నన్ను మరీ మరీ వివశుణ్ణి చేశాయి.

ఇంకా చుట్టూ చాలా మంది ఉన్నా ఆ రూపం నా కళ్ళల్లో, నాగుండెల్లో పడిపోయింది.

నన్ను అలాగే చూస్తోంది. పెదవులు బిగించి కొంటెగా నవ్వుతూ... నాకు వెర్రెత్తి పోయింది.

నా ఊహాసుందరి నా కలలరాణి... అదే నేను ఊహించే రూపం ఒక్క నిమిషం... ఒకే ఒక్కనిమిషం ఆ అందాన్ని నా స్వంతం చేసుకోవాలని పించింది.

నేను పిచ్చివాడిలా, షాక్ కొట్టినట్లు అలా నిలబడి పోయాను.

ఆమె కూడా నన్నే చూస్తోంది. నాకు తెల్సు. ఆ కొంటెనవ్వుల కోణంగి జాణతనం!

మా వాళ్ళిద్దరూ ఎవరో పల్లె పిల్లల్ని చూస్తున్నారు.

పోన్లే సంతోషం. నాకు పోటీగా నా బ్యూటీ అందాన్ని కళ్ళతో జుర్రేయకుండా వారి దృష్టి వేరే వారిపై మళ్ళి నందుకు!

ఆమెను చూసి ఆశగా పెదవులు తడుపుతున్నా ఆమె చూపులో మార్పులేదు. నన్నే కొంటెగా చూస్తు నవ్వుతోంది.

ఆ చూపులో అందం, కొంటెతనం, చిలిపి తనం గడుసుతనం... ఎన్నెన్నో భావాలు, ఆ కాటుక కళ్ళ వెనకాల అనేక చిలిపి ఊసులు!



ఆమె కట్టుకున్న వైలట్ రంగుచీర ఆమె రంగునీ, పొంగునీ ఇంకా రెట్టింపు చేస్తున్నాయి.

నా కాళ్ళు ఇంక ముందుకు వెళ్ళనంటున్నాయి. నా కళ్ళు ఎటూ తిరగనని మారాం చేస్తున్నాయి.

ఈలోగా మా వాళ్ళు "ఒరేయ్.... రారా... బాబూ" అని భుజంపైన తట్టి నాలుగుసార్లు రమ్మంటే విధిలేక వార్ని అనుసరించాను!

అలా వెళ్తూ వెళ్తూ వెనక్కి కనీసం పదిసార్లు తిరిగి చూశాను. ఆమె ఇంకా నన్ను అదేచూపూ, అదే నవ్వుతో రెచ్చగొడుతోంది.

విధిలేక బలవంతంగా చూపు మరల్చుకొని వచ్చేశాను.

రూంకి వచ్చినా నా మనస్సు నా కంట్రోల్లో లేదు. ఆమెను ఎలాగైనా నా స్వంతం చేసుకోవాలి. ఆమె నాది కావాలి.

ఆ సొగసుచూడ తరమా? మరెవరికైనా? ఇదే నా ఆలోచన!

అయినా నా అనుమానం. మళ్ళీ రేపు ఆమె ఉండాలిగా అక్కడ?

మా వాళ్ళిద్దర్నీ గమనించాను. వాళ్ళు వాళ్ళకి తగిలిన కలర్స్ గురించి చర్చించుకుంటు న్నారు. మధ్య మధ్య నన్ను కదిపి ఏదో జోక్స్ వేస్తున్నారు. ఆ రాత్రి నాకు నిద్దర్లేదు. కలలో ఆమె అందంగా ఇంకా ఏదో ఏదోగా... నా మనసు నా స్వాధీనంలో లేదు.

మర్నాడు మా వాళ్ళిద్దరికీ నా మనసులో మాట చెప్పాను. ఆమె నాక్కాలన్నాను. వాళ్ళు ఓ సలహా ఇచ్చారు. ఆమె పైన మనసు పారేసుకున్నానని హేళనగా ఉన్నట్లుంది... అయినా నేనేం చెయ్యలేదు.

కళ్ళు మూసినా ఆమె...కనులు తెరచినా ఆమె. బ్యాంక్‌కి వెళ్ళినా అన్య మనస్కంగానే గడిపాను.

ఆ రోజు శాలరీడే - మా వాళ్ళిద్దరూ అట్నుంచటే తుని వెళ్ళిపోయారు. నేను ఓ నిశ్చయానికి వచ్చాను అప్పటి కప్పుడే!

ఆమె మళ్ళీ కన్పిస్తుందా? కన్పిస్తే బాగుండును. మళ్ళీ పుష్కర ఘాట్ వైపు నడిచాను. దిగులుగా నా చూపులు అన్నివైపులా ఆత్రుతగా గమనించాయి. జేబు తడుముకున్నా. పర్సుబరువుగా తగిలింది.

తక్కున నా చూపు ఒక వైపున నిల్చిపోయింది. ఆమె కనపడింది. అందంగా, ఆహ్లాదంగా గోదావరినదిలో పూర్తిగా తడిసి అదే నవ్వు...

ఇంక ఆగలేకపోయాను. ఒక్క క్షణం ఆలస్యం చెయ్యలేదు. సుడిగాలిలా కదిలాను! జేబు తడుము కుంటూ!

★ ★ ★

తృప్తిగా గాలి పీల్చుకున్నాను. ఆమె ఇంక నాదే పూర్తిగా నా స్వంతం... అతి జాగ్రత్తగా ఆమెని పొదివి పట్టుకున్నాను.

ఆమెని డబ్బు పెట్టి కొనుక్కున్నాను. నా కిప్పుడు చాలా చాలా సంతోషంగా ఉంది.

ఇంక రేపటి నుంచి నా కలలరాణి నా రూంలో... నా ఎదురుగా నా ప్రక్కనే అనుకుంటూ ఎగ్జిబిషన్ హాల్ నుంచి ఆనందంగా ఈలవేస్తూ నాకునచ్చిన ఆయిల్ పెయింటింగ్‌ని తీసుకువచ్చాను!

★





ప్రియా! ఓనాప్రియా!!
నీ చిరుగాలుల సవ్వడిలో....
చిగురించే నా బతుకు-
శిలలాగా మార్చకు!
చీకటి తెలియని,
నా జీవితానికి
చివరి కానుక ఇవ్వకు.

- ఎల్. చంద్రమోహన్,
S/o. సాయిలు,
మిట్టాపల్లి (పోస్ట్),
డిచ్‌పల్లి (మండల్),
నిజామాబాద్.




ఆడది పుట్టకపోతే పుట్ట లేదంటాడు
పుట్టింది అంటే పుట్టెడు అప్పులంటాడు
మంచిగ మాట్లాడితే మహాలక్ష్మి అంటాడు
కొంచెం తిరగబడిందా, మహంకాళి అంటాడు
బళ్ళోకెల్లే ఆడదాన్ని బట్టకట్టి బ్రతక నీడు!
చదువులేని ఆడదానితో సంబంధం నచ్చుకోడు
నవ్వుతున్న ఆడదాన్ని నమ్మకోయ్ అంటాడు
పక్కనున్న చెల్లెమ్మకి పరుల గాలి సోకనీడు
పరాయి ఆడదాన్ని పగలే రానుక పోతాడు-
ప్రతిరోజు వెంటపడి ప్రేమలోకి దించుతాడు
పెళ్ళిమాట ఎత్తగానే పెడ చెవిన పెడతాడు
అన్నింట్లో పైచేయి ఆడదానిదేనంటాడు
కాని, పెంచిన తల్లి మీద కరుణా అయిన చూపడు
తోడ పుట్టిన చెల్లమ్మకు తోడనై చూపడు-
తానే మగ మహారాజుని తెగ పొంగి పోతాడు
బెల్లంలా దొరికిన పెళ్ళానికి మళ్ళీ లొంగిపోతాడు.

-ఎల్. జయ జ్యోతి,
ఎమ్.ఎస్.ఆర్,
నిజామాబాద్.




డి. శ్రీధర్, కొండాపురం, రాయదుర్గం తాలూకా, అనంతపురం జిల్లా